# నీళ్ళు

## తెల్లారింది!

**అయిదు గంటలకే కీ ఇచ్చి పెట్టిన గడియారం అలారం మోగుతాంది. ఏదో పీడకల లోంచి మేలుకున్నట్టు నా భార్య గబుక్కున లేచి కూర్చుంది.**

హీరేహాల్ మండలంలో టైపిస్టుగా నా ఉద్యోగం. ఎనిమిది గంటలు అయ్యేసరికి టిఫిన్‌తో పాటు భోజనం కారియర్ కూడా సిద్ధంగా వుండాల నా కోసం. నేను రాయ దుర్గం నుంచీ హీరేహాల్‌కు వెళ్ళాల్సిన బస్సు ఎనిమిదిన్నరకే. అందుకే ఆమెకు అంత గాభరా!

"అక్కా! అక్కా!! నీళ్ళు! నీళ్ళు!! నీళ్ళు వస్తాందాయి" పక్కింటి వెంకటేశులు తలుపు కొడు తున్న శబ్దం!

బయట నుంచీ హడావుడిగా కేకలు విన్పిస్తు న్నాయి. ఏదో పండుగ సంరంభం మాదిరి. ధన్‌వర్ష సూపర్ బంపర్ లాటరీ తగిలిన వార్త విన్నట్టు పరుగెత్తుకుంటా వెళ్ళి తలుపు తీసింది. అప్పటికే బిందెలు చప్పుడు చేసుకుంటా పరుగెత్తుతున్న వెంకటేశుల అడుగుల చప్పుడు!

"లెండి లెండి నీళ్ళు వస్తున్నాయంట. దారికి అడ్డం, దోమతెర తీసెయ్యండి" అంటూ లోపలికి పరుగెత్తి రెండు క్షణాల్లో మూడు బిందెలు తీసికొని దోమతెర కింది నుంచీ దూరి బైట కొచ్చి "పిల్లోల్లు లేస్తారేమో, కొంచెం చూస్తా వుండండి" అని గబ గబ వెళ్ళిపోయింది.

నాకింకా నిద్ర మత్తు పోలేదు. గుండెలో గుబులు

ఈ బాబుగాడు లేస్తే ఫరవాలేదు. చిన్ని లేస్తే ఎట్ల? దానికి సంవత్సరం దాటింది, అంతే! వాళ్ళ అమ్మ తప్ప మిగతా వాళ్ళెవరూ విశ్వాసపాత్రులుగా కన్పించరు దానికి. వాళ్ళ అమ్మ క్షణం కన్పించక పోతే ఫ్యాక్టరీ సైరన్ మాదిరి గుయ్యుమంటుంది.

దోమతెర తీసేసి నేనూ వాళ్ళ పక్కనే పడు కున్నాను. బద్ధకంగా కళ్ళు మూసుకుని పది నిమిషాలు దాటింది. కాలకృత్యానికి కడుపులో కదలిక మొదలైంది.

మాకూ, మా పక్క పోర్షన్‌లో బాడుగకు వుంటు న్న వాళ్ళకు ఇద్దరికీ కలిపి కామన్‌గా ఒకే సెప్టిక్ లెట్రిన్ వుంది.

లెట్రిన్‌లో నీళ్ళ బాన వుంటుంది గానీ అందులో నీళ్ళుండవు చాలాసార్లు. బానలోకి నీళ్ళు ఆ పక్కింటి ఆమె పోస్తుందిలే అని నా భార్య, నా భార్య నింపుతుందిలే అని ఆ పక్కింటి ఆయమ్మ! ఇద్దరూ ఇద్దరే! రెండు బిందెలు పాపం! ఏ ఇల్లాలు మాత్రం అంత ఉదారంగా ఆలోచించగలరు, ఈ నీటి కరువులో?


లేచి బాత్ రూమ్‌కు పోయి తొట్టి లోకి తొంగి చూస్తే ఒక్క నీటి చుక్క లేదు. ఖాళీ! వంటింట్లోకి పోయి బిందెలోంచీ నీళ్ళు ఒంచుకుంటాంటే, అప్ప డప్పుడే వచ్చిన నా భార్య ఏదో ఘోర ప్రమాదం జరగబోతున్నట్టు అరిచింది.

"అవికాదు. అవికాదు. అవి తాగే నీళ్ళు. పక్కన ప్లాస్టిక్ బిందెలో వున్నాయి చూడండి, ఉప్పు నీళ్లు! అవి వంచుకోండి"

నేను తిరిగి వచ్చేటప్పటికి ఇంట్లో పాచి కసువు లూడ్చి, మళ్ళీ కొళాయి దగ్గరికి పరుగెత్తడానికి సిద్ధ మైంది. అక్కడే నిలబడి వెనకల వచ్చిన వాళ్ళని గుర్తు పెట్టుకుంటే తప్ప మన వరకూ వంతురాదు' అంటూ.

ఇంతలో చిన్ని లేచింది. ఏడుపు చిన్నగా మొదలై తారా స్థాయిని అందుకుంది.

"నన్ను చూస్తే విడిచి పెట్టదు. మీరే ఎత్తుకుని



ఆడించండి కొంచెం సేపు. వంతు వచ్చి వుంటే నీళ్ళు పట్టుకొస్తాను" అని గుస గుసగా చెప్పి పాపకళ్ళకు కన్పించకుండా బైట పడడానికి ప్రయత్ని స్తాంది గోడల వైపు నక్కి.

నేను గాభరాగా అరిచాను.

"అది ఉండదు. ఉండదు. నా దగ్గర నువ్వే ఎత్తుకుపో. లేకపోతే అది ఏడ్చి నన్ను చంపుతుంది" అని

ఇంకే తప్పదన్నట్లు పాపను చంకలో వేసుకొని "మీరు స్నానం చేసి బాబుగాడు లేస్తే వానిక్కూడ స్నానం చేయిస్తారా" అని జాలిగా ముఖం పెట్టి అర్థించింది.

ఆమె అట్ల జాలిగా ముఖం పెట్టకుండా వుంటే బహుశ నేను కేక లేసే వాణ్ణేమో, వానికి స్నానం చేయించే బాధ్యత నాకు అంటకడుతున్నందుకు.

ఆ కొళాయి దగ్గర పడిగాపులు పడడమే సరి పోతుంది ఆమెకు పొద్దంతా. నీళ్ళ ఇబ్బంది గనక లేకపోతే నాకు ఇంటి పనులు ఒక్కటి కూడా చెప్పే మనిషికాదు. పాపం! ఆమెకు మాత్రం నాలుగు కాళ్ళు నాలుగు చేతులూ లేవు కదా! అక్కడ నీళ్ళా ఇక్కడ ఇంటి పనులూ అన్నీ ఒక్కతే చూసుకోవ డానికి.

బాత్ రూమ్‌లోకి పోయినాను.

బకెట్టులో నీళ్ళు తోడి రెడీగా వుంచి పోయింది.

బకెట్టు నీళ్ళు!

మూడు నాలుగు చెంబులు ఇంకా తక్కువే వున్నట్టున్నాయి. బకెట్టుకు సర్దుకోవాల అంతే! తప్పదు!

ఒకప్పుడు ఎంత గొప్పగా బతికిన వాణ్ణి!

వాల్తేరు యూనివర్శిటీలో ఎం.ఎ. చదువుతూ హాస్టల్‌లో వున్నప్పుడు చెంబులు చెంబులు నీళ్ళు గుమ్మరించుకుంటూ స్నానం చేస్తుంటే బాత్ రూమ్ బైట నలుగురైదుగురు చేరి 'ఇంక చాలురారా తండ్రీ' అని గోలపెట్టేవాళ్ళు. సాయంత్రం పూట తొందర పెట్టే వాళ్ళు లేక ఇష్టా రాజ్యమై పోయి జలకాలాడే వాణ్ని. అదంతా స్వర్ణయుగం. ఆ అలవాటే వచ్చింది అనంతపురం వచ్చినాక కూడా!

"ఏ స్నానాలకు నీళ్ళు మొయ్యలేక చచ్చి పోతున్నా(నా పెద్దోడా" అని అమ్మ నవ్వుతూ నవ్వుతూనే మొరపెట్టుకునేది పాపం! ఇంట్లో స్వంతంగా వేయించుకున్న ట్యాప్‌ని కళ్ళ చూడ కుండానే చచ్చిపోయింది గానీ లేకపోతే ఎంత సంబర పడేదో?

ఈ రాయదుర్గంలో ఇంట్లో ట్యాప్ వేయించు కున్న వాళ్ళకు కూడా తిప్పలే! నీళ్ళు ఒకరోజు వస్తే ఒక రోజు రావు

'ట్యాప్ వున్న ఇంటికి మారదాం పోనీ' అంటే ఓకటి కాదు, రెండు కాదు, నాలుగు వందల రూపాయిలు బాడుగ! ఇంక మనం కడుపుకేం తింటాం! బట్టేం కడుతాం? పైగా ట్యాపుల్లో కూడా సరిగా నీళ్ళు రావు కదా, ఈ ఊర్లో" అంటుంది.

ఛీ ఛీ! పొద్దున లేచింది మొదలు నీళ్ళా నీళ్ళా... ఒకటే ఉరుకులూ పరుగులూ!

చిన్నిని ఎవరి చేతికో ఇచ్చినట్లుంది, పట్టుకోమని. చంకన ఒక బిందెతో, భుజం మీద మరొక బిందెతో వచ్చింది. "దించుకోండి దించుకోండి భుజం మీది బిందె దించుకోండి అబ్బా" అంటూ మూలిగింది.

నాకు ఛ్రుమని కోపమొచ్చి భుజం మీది బిందె లాక్కుని పోయి ధబీమని పెట్టినాను, బాతరూమ్ దగ్గర.

నా పరిస్థితి ఏం పట్టించుకోకుండా "అయ్యో! మెల్లగా దించండి. బిందె పాడైపోతుంది" అని రెండు బిందెలూ వంటింట్లో దింపి మరో రెండు బిందెలు తీసుకొని బయల్దేరింది. వాకిట్లో బాబుగాడు 'అమ్మా! నీళ్ళు తే' అంటూ నిలబడినాడు నిక్కరు లేని అంగీని గుండెపైకి ఎత్తిపట్టుకుని.

చెంబునీళ్ళతో వాడి పని కానిచ్చి "మీ నాయనతో నీళ్ళు పోయించుకొని బడికి పోరా! ఒంటికి విడిచినప్పుడు వచ్చి అన్నం తినిపో!" అంటూ వెళ్ళిపోయింది.

ఆమె మరో కడవనీళ్ళు తెచ్చేటప్పటికి ఎనిమిది కావస్తాంది. బాబుగాడు బడికి పోయినాడు. వానికి ఏడున్నరకే బడి. నేను బైటికి పోయొచ్చి కూర్చున్నాను, ఇంత టీ తాగి సిగరెట్టు కాల్చుకుంటూ. మనసు కొంచెం తృప్తిగా వుంది. ఒక చంకలో ఏడుస్తున్న చిన్నిని కరిపించుకొని మరో చంకలో నీళ్ల ఎత్తుకొని వస్తుంటే - పాపం! కష్టపడుతాంది అని జాలి కూడా కలిగింది నా భార్య మీద.

ఎదురుపోయి ఏడ్చే పాపను చేతుల్లోకి తీసుకున్నాను. అది మరింతగా పెడబొబ్బలు పెడతా వాళ్ళ అమ్మ వైపు చేతులు చాచింది.

"ఎట్ల పుట్టిందో ఏమో! రాకాసి పిల్ల! ఎవరు ఎత్తుకున్నా వుండదు. నేను దీన్ని మోస్తునా? లేక నీళ్ళ బిందెలు మోస్తునా ??" అని విసుక్కుంటూ నీళ్ళ బిందె అక్కడే దింపి- "మూస్తావా లేదా నోరు. దయ్యం ముండా" అని గదురుకొంది పాపని.

'అబ్బా నీరసం. కళ్ళు తిరుగుతున్నాయి' అని వాలిపోయింది పరుపు పైకి.

పాపను కిందికి వదిలితే గుక్కపట్టి ఏడుస్తా పాకుతా పోయింది వాళ్ళ అమ్మ గుండెల పైకి.

"పాపం! ఆకలి అవుతా ఉంటుంది. పొద్దున్నుంచీ పాలు పట్టలేదుకదా దానికి! అందుకే ఏడ్పు... ..." అన్నాను మెల్లగా.

నీరసంగా మూతపడిన ఆమె కనెప్పల కింద చటుక్కుమని కన్నీళ్ళు! నేను గబుక్కున లోపలికి పోయి స్టౌ వెలిగించి అముల్ పాడిలో పాలు కలిపి తీసుకొచ్చినాను.

"ఈ నీళ్ళ పనితో నేను సరిగా చూసుకోలేను దీన్ని ఇక్కడ. మా అమ్మ దగ్గరికి పంపిస్తాను" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"అట్లేకానీ!" అన్నాను.

తన రొమ్ము నుంచీ విడిపించి పాలు పట్టింది పాపకు.

"వంట చేసే దానికి టైం లేదు కదా! ఈ పొద్దు హోటల్‌లోనే భోం చేయండి" అంది జాలి కళ్ళతో చూసి.

'సరేలే' అన్నాను కానీ హోటల్ భోజనం నా ఒంటికి పడదు. కడుపులో బర్నింగ్. అమీబియాసిస్. రెండిట్లో ఏదో ఒక బాధ తప్పదు. ఆ విషయం ఆమెకూ తెలుసు. కానీ ఏం చేస్తుంది పాపం? నా



-స్వామి

ఆకలంటే తెలీని వాడికి ఆకలి బాధ తెలీనట్టే, నీటి కరువు లేని వాళ్లకి నీళ్ల లేనివాళ్ళ బాధలు తెలీవు. చెప్పినా అతిశ యోక్తులనుకోవచ్చు. అసహ్యించుకోవచ్చు. గ్లాసుడు నీళ్ల వొలకబోస్తే కన్నబిడ్డల్ని చావ బాదడం, కడివెడు నీళ్లకోసం తలలు పగుల కొట్టుకోవడం... మరీ అనాగరికం అనిపించ వచ్చు.

నిజమే. 'నీళ్ల లేని వారికి ఏం నాగరికత వుంటుంది?' అయితే, ఆ నీళ్ల లేనివాళ్లు నీళ్ల లేకుండానూ, నాగరికత లేకుండానూ బతకాలని నిర్ణయించుకోలేదు. కనుక, ఆ అనాగరికతకు వాళ్లు బాధ్యులు కారు. వాళ్లనలా ఆ అనాగరికతలో వుంచిన వాళ్లదే ఆ బాధ్యత.

చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకొని ప్రేమగా నొక్కుతా కళ్ళుమూసుకుంది.

* * *

రాయ దుర్గానికి పది మైళ్ళ దూరంలో ఒక ఏరు. ఆ ఏట్లో ఒక బోరు వేసి అక్కడి నుంచీ పైప్ లైన్స్ ద్వారా రాయ దుర్గం మునిసిపాలిటీకి నీళ్ళు పైపుల్లోని నీళ్ళను ఊరి వైపు తొయ్యడానికి రోడ్డు పక్క నాలుగు నాలుగు మైళ్ళల్లో రెండు మిషిన్లు.

కరెంటు పోయినప్పుడుగాని కరెంటు కోత వున్నప్పుడు గానీ కొళాయిల్లో నీళ్ళు రావు.

మోటార్లు ట్రబులిస్తే వాటిని బాగు చేసే వరకూ మూడు నాలుగు రోజులు నీళ్ళు రావు.

ఛైర్మన్ రాంరెడ్డి ఊరికి నీటి సమస్య తీర్చినానని చెప్పి ఓట్లు వేయించుకుంటాంటే నాయుడి పార్టీ వాళ్ళకు మంట. నాయుడి పార్టీ వాళ్ళు అడపా దడపా పైపుల్ని పగల గొడుతూనే వుంటారు. అప్పుడూ నీళ్ళు రావు.

సరిగా పనిచెయ్యని సెకండ్ హేండ్ మోటార్లు వేయించి మునిసిపాలిటీ దుడ్లు దిగిమింగినాడు రెడ్డి అని కొందరి ఫిర్యాదు.

'తన అపోజిషన్ పార్టీ వాళ్ళు ఉన్న వీధి కొళాయిల్లోకి నీళ్ళు వదలరు చూడు' అని మరి కొందరి కంప్లయింటు.

నీళ్ళ రాజకీయాలు.

ఓట్లు సంపాదించుకునే రాజకీయాలు.

నోట్ల కట్టలు మరిగిన రాజకీయాలు.

* * *

ఆ రోజు ఎలక్షన్ డ్యూటీ ముగించుకుని; ఎలక్షన్ డ్యూటీ మీదే వచ్చి రోడ్లో తారసపడిన అనంతపురం ఫ్రెండును వెంట బెట్టుకుని రాత్రి తొమ్మిదింటికి ఇల్లు చేరుకునే టప్పటికి - ఇంట్లో చుక్క నీళ్ళు లేవు!

పక్కింటి ఆయమ్మను అడిగి రెండు చెంబులతో మంచి నీళ్ళు తెచ్చి పెట్టి అన్నం వడ్డించింది. అతనికి ముందు గదిలో పడక ఏర్పాటు చేసి కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడి లోనికి వచ్చే టప్పటికి ఏదో మాట్లాడే దానికి సన్నద్ధమై ఉంది.

"అక్కడ ఊర్లో చిన్న ఎట్లుందో ఏమో!" అంది.

"మన కంటే బాగానే చూసుకుంటా ఉంటారులే వాళ్ళు!" అన్నాను.

"చిన్ని పదే పదే గుర్తుకొస్తోంది. చూడబుద్ధి పుడతా ఉండేది" అని బొట బొట కన్నీళ్ళు కార్చింది.

పాపను పంపించి ఇంకా వారం రోజులన్నా కాలేదు.

"ఆ కొళాయిల దగ్గర అలాగాజనం ఏమేమో మాట్లాడతారు. ఆ మాటలన్నీ నేను పడలేను. వాళ్ళతో సరిగా కొట్లాడాలంటే నాకు చేత కాదు. తొందరగా ట్రాన్స్‌ఫర్ చేయించుకోండి ఇక్కడి నుంచీ" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

మా మామ మినిస్టరా? ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు ట్రాన్స్‌ఫర్ రావడానికి.

తెల్లారిలేస్తే ముఖాలు కడిగేదానికి నీళ్ళు లేవు. మా ఇంటి దగ్గర ఉన్న బోరు కూడా చెడిపోయిందంట.

పక్కింటిలోంచి మళ్ళీ ఒక గిన్నెలో నీళ్ళు తీసుకొచ్చి పెట్టింది బాత్‌రూమ్‌లో

"మిత్రమా! ఏం అనుకోవద్దు. స్నానానికి నీళ్ళు లేవు. ముఖానికి మాత్రం ఇన్ని నీళ్ళు చల్లుకో" అన్నాను.

అతడు ముఖం కడిగి గుడ్డలు వేసుకుని పోతుంటే - 'భోంచేసి పోదువులే' అన్నాను. నాలుక మీంచీ వచ్చింది ఆ మాట నా నుంచీ.

"మళ్ళీ ఎప్పుడైనా వస్తాన్లే సోదరా! చాలా అర్జంటు పని వుంది" అని మా పరిస్థితిని అర్థం చేసుకొన్న వాని మాదిరి మెల్లగా గొణిగి వెళ్ళిపోయినాడు.

"ఇంటికి ఎవరన్నా వస్తే ఏమనుకుంటారు మన గురించి; ఇంట్లో చుక్క నీళ్ళులేకపోతే" అంటూ ఆమె ఒకటే ఏడ్పు.

నిజమే! నీళ్ళే నాగరికత అన్నారు ఒక పెద్దాయన.

* * *

ఆ మరుసటి రోజు కూడా నీళ్ళు రాలేదు.

"కోటలోకి పోయి ఒక బిందె చేదుకు రాపోండి మంచి నీళ్ళు" అంది.

"నేనా? బిందెలు పట్టుకుని పోవల్లా?" అంటూ ఆశ్చర్యపోయినాను.

"ఎట్ల? అంత దూరం నేను పోలేను కదా మరి" అంది.

"ఇంత బతుకూ బతికి ఈనాడు బిందెలు పట్టుకుని పోవల్లా నేను వీధిలోకి అట్లాంటి వన్నీ నాకు చెప్పొద్దు" అన్నాను ఖండితంగా.

"మరి వంట చేసేది ఎట్ల నీళ్ళు లేకపోతే?"

నీళ్ళు లేకుండా వంట చెయ్యడమెట్లో ఏ శాస్త్రజ్ఞుడైనా కనిపెడితే బావుండు!

"ఈ రోజు హోటల్ నుంచీ తెప్పించుకుందాము భోజనం" అన్నాను.

"మరి తాగేదానికి నీళ్ళూ...?"

"ఒక చెంబునీళ్ళు ఎవర్ని అయినా అడిగి తీసుకో! నువ్వు, బాబుగాడూ తాగండి. నేను హోటల్‌లో తాగొస్తాను."

"ఇది సంసారమా?" అంటూ అరిచింది సహనం కోల్పోయి.

నేను ఏం పట్టించుకోకుండా వెళ్ళిపోయినాను; ఇంటికన్న గుడి పదిలం అన్నట్లు బజార్లోకి.

ఈ ఆడవాళ్ళు ముందుగా బతిమాలి బామాలి మగవాళ్ళతో పనులు చేయించుకుంటారు. తర్వాత తర్వాత ఆ పని చెయ్ ఈ పని చెయ్ అని మగవాళ్ళ మీద ఆర్డర్లు వేసే స్థాయికి ఎదిగి పోతారు. ఏమైనా సరే? బిందె ముట్టుకోకూడదు అని భీష్మించుకున్నాను.

రాత్రి ఎనిమిది గంటలకు ఇల్లు చేరినాను

బాబుగాడు బయట ఆడుకుంటున్నాడు. ఇంట్లో నిశ్శబ్దంగా వుంది. నా భార్య ముభావంగా వుంది.

'వంట చేసినావా'అని అడిగేదానికి నాకు నోరు రాలేదు.

"గిన్నెల క్యారియర్ తీసుకురా. భోజనం తెస్తాను" అన్నాను గొంతు పెగల్చుకుని.

"అన్నం చేసినాను. ఆ చెంబులో నీళ్ళున్నాయి. కాళ్ళు కడుక్కుని వచ్చి కూర్చోండి" అంటూ బాబుగాడ్ని కేకేసింది "అన్నం తిందువురారా" అని.

"అయితే కాళ్ళు కూడా కడుక్కోవచ్చు అన్న మాట!

'ఎక్కడ సంపాదించినావు నీళ్ళు'అని అడిగేదానికి ధైర్యం చాల్లేదు.

చాపలు పరిచి మూడు ప్లేట్లలో అన్నం వడ్డించింది.

ప్లేట్ల పక్కన రెండు చెంబుల్లో నీళ్ళు పెట్టింది.

"ఇదిగో! ఈ పెద్ద చెంబులో నీళ్ళు తాగేదానికి, ఈ చిన్న చెంబులో నీళ్ళు చేతులు కడిగేదానికి" అంటూ ఒక హెచ్చరిక చేసింది.

అన్నం ముద్ద నోట్లో పెట్టుకోబోతుంటే నాలో అపరాధ భావం - పాపం! ఎన్ని అగచాట్లు పడిందో ఈ కొన్ని నీళ్ళు సంపాదించడానికి అని.

నా నిశ్శబ్దం! ఆమె ముభావం! బాబుగాని ద్వారా ఆమెతో మెల్లగా మాటలు కలపాలని నా ప్రయత్నం. ఆమె అంటీ ముట్టని తనం నాకు భరించలేనిదిగా వుంది.

బాబుగాడు వాళ్ళ టీచరు గురించి మాట్లాడుతున్నాడు.

ఇద్దరమూ వానితో మాట్లాడతా కొంచెం సేప

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

టికి వాన్ని వదిలేసి మేం ఇద్దరమే మాటల్లో పడిపోయినాము; ఇంక వాని అవసరం తీరిపోయినట్లు.

వాడు అన్నం తినడం ముగించి చేతులు కడుక్కుంటాన్నాడు. నా భార్య అదిరి పడింది వాని ప్లేటులోకి చూసింది.

నీళ్ళు ప్లేటులో నిండి కిందికి పొర్లి పోవడానికి సిద్ధంగా వున్నా వాడు చెయ్యి కడిగేసుకోవడం ఆపలేదు.

"అన్ని నీళ్ళు ఒలకబోయొద్దురా" అంటూ అరిచింది.

వాడు భయపడిపోయి నిశ్శబ్దంగా చెంబు కింద పెట్టినాడు. అప్పుడు గమనించింది ఆ చెంబుని. అది పెద్ద చెంబు! అది మంచి నీళ్ళ చెంబు!!

"అయ్యో!" ఎడం చేత్తో ధనాధనా ఉతికింది వాని చెంపల్నీ, వీపునీ, తలనీ ఎక్కడ పడితే అక్కడ.

"అమ్మా... అమ్మా... లేదమ్మా! ఇంక ఒలకబొయనమ్మా" వాని పెదబొబ్బలు నోరంతా వెళ్ళబెట్టి ఏడుస్తాంటే ముఖంలోని చెంపలు కళ్ళపైకి సాగినాయి. వాని కళ్ళల్లో నీళ్ళు చూసి నా కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగినాయి. ఆమె పిచ్చెత్తినట్లు దబదబా కొడతానే వుంది వాన్ని. నేను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

కొంచెం సేపటికి వాన్ని కొట్టడం ఆపి ఏడుస్తా కూర్చుంది.

తలెత్తి నా కళ్ళల్లోకి చూసి నా కన్నీళ్ళు కన్పించి బావురుమంది.

అప్పటికే బాబుగాడు నా వీపు వెనక చేరి గోడవైపు నక్కి కౌగలించుకున్నాడు నన్ను.

* * *

రాత్రి పది గంటలు.

పడుకుందామని పక్కలు వేసుకుంటూంటే-

నీళ్ళు నీళ్ళు... అంటూ వీథిలో కేకలు

రెండు బిందెలు తీసుకుని బయల్దేరింది. నేనూ రెండు ప్లాస్టిక్ బిందెలు తీసుకుని బయల్దేరినాను. నా ముఖంలోకి చూసింది. "నేనూ వస్తాన్లే పద" అన్నాను.

ఆమె కళ్ళల్లో జాలి!

వారం రోజుల నుంచీ నీళ్ళు తీసుకు రమ్మని పట్టి పీకి సతాయించి తీరా నేను బిందెలు పట్టుకుని బయల్దేరేప్పటికి ఆమెలో గిల్టీ కాన్షస్‌నెస్; భర్తతో నీళ్ళు మోయించబోతున్నాను కదా అని.

నిద్రపోతున్న బాబుగాన్ని ఒకసారి ముద్దు పెట్టుకుని పక్కింట్లో పడుకోబెట్టి వచ్చి నేనూ బయల్దేరినాను.

మా ఇంటికి దగ్గరలో వున్న రెండు కొళాయిల దగ్గర గుంపులు గుంపులు మనుషులు. అరుపులూ, కేకలూ, సైకిళ్ళకు తగిలించుకున్న బిందెలూ... అంతా కోలాహలంగా వుంది.. ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు నోట్లో నీళ్ళు పోసుకొని మంచి నీళ్ళే,

> 'అమ్మా! అమ్మా! లేదమ్మా, ఇంక వొలకబోయనమ్మా' వాని పెదబొబ్బలు నోరంతా వెళ్లబెట్టి ఏడుస్తాంటే, ముఖంలోని చెంపలు కళ్లపైకి సాగినాయి. వాని కళ్లల్లో నీళ్ల చూసిన నా కళ్లలో నీళ్ల తిరిగినాయి. ఆమె పిచ్చెత్తినట్లు దబదబ కొడుతూనే వుంది వాన్ని. నేను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.
>
> కొంచెం సేపటికి కొట్టడం ఆపి ఏడుస్తా కూర్చుంది. తలెత్తి నా కళ్లల్లోకి చూసి నా కన్నీళ్ల కనిపించి బావురుమంది.

మంచి నీళ్ళే అంటున్నారు.

కొన్నిసార్లు ఉప్పు నీళ్ళు కూడా వస్తాంటాయి కొళాయిల్లో. మరో ఏటి వైపు నుంచీ వచ్చే పైప్ లైన్లలోంచీ.

నా భార్య కొళాయిల దగ్గరికి పోయి "జోరుగా వస్తాన్నాయా నీళ్ళు?" అని వాకబు చేసింది.

"చిన్న పిల్లోల్లు ఒంటికి పోసినట్ల వస్తాన్నాయి" అంది ఒక ఆయమ్మ.

కొంచెం దూరమైనా సరే అనుకుని బస్టాండు దగ్గర వున్న కొళాయికి పోయినాము.

అక్కడ కూడా గుంపులు గుంపులు జనం!

'నీళ్ళు జోరుగా వస్తాన్నాయి. ఇక్కడే మేలు, జనం ఎక్కువగా వున్నా" అని తీర్మానం చేసింది నా భార్య.

బస్టాండు!

బస్టాండు బైట కొళాయి.

కొళాయి పక్కన హోటలు.

హోటలు బైటి గోడకు అతికించిన సినిమా వాల్ పోస్టర్లు.

గోడ కింద నేల తేమ తేమగా వుచ్చ కంపు కొడతాంది.

అక్కడ పండ్ల దుకాణాల వాళ్ళు పారేసిన కుళ్ళి పోయిన పండ్లు.

వాటిని తోకలాడించుకుంటా తింటాన్న ఆవులూ, దూడలూ!

ఝుమ్మంటూ పైకి లేస్తాన్నాయి ముసిరిన ఈగలు.

పైట చెంగుల్తో ముక్కు మూసుకుని మాట్లాడుతున్న ఆడవాళ్ళు!

రోడ్లో షాపులూ, అంగళ్ళూ, హోటళ్ళూ అన్నీ కట్టేసినారు. ఒక మూల తెరిచిన పాన్ బంకు దగ్గరా, పెట్రోమాక్సులైటు వెలిగే టీ బండి దగ్గరా ఏడెనిమిది మంది జనాలు.

"టీ తాగురావా" అని అడిగితే - "అమ్మో ఇక్కడా? వద్దు" అంది నా భార్య. నేను టీ తాగి సిగరెట్ కాలుస్తా కాలుగాలిన పిల్లి మాదిరి అటూ ఇటూ తిరుగుతున్నాను.

ఆమె నీళ్ళకు వచ్చిన ఆడవాళ్ళతో మాట్లాడతా నిలబడింది. నీళ్ళకు వచ్చిన మగవాళ్ళతో నేను మాటలు కలపలేకపోయినాను. రాయలసీమ మీద జోకులు!

"కొన్నేండ్లకు అనంతపురం ఎడారి అయిపోతుందంట"

"అప్పుడు మా ఇంటికి నువ్వూ; మీ ఇంటికి నేనూ రావల్లంటే ఒంటెల మీద తప్ప రాలేము" నవ్వుతాన్నారు.

"ఒకవైపు తుఫానొచ్చి ఊర్లకి ఊర్లే మునిగిపోతాంటే ఇక్కడ మన అనంతపురం మీద జల్లులు కూడా పడవు"

"జల ప్రళయమొచ్చి ప్రపంచమంతా మునిగిపోయినా మనకేం భయం వుండదు. ఇంత తేమ కూడా కాకుండా పొడి పొడిగా తేలతానే వుంటుంది మన రాయలసీమ"

నాకు నిద్ర వస్తాంది. ఆవలింతలు.

అందరి చూపులూ అటూ ఇటూ తిరిగి కొళాయి కింద బిందెపైకే ప్రసరిస్తాన్నాయి మళ్ళీ మళ్ళీ.

నిండిన బిందె తీసి దాని స్థానంలో ఖాళీ బిందె పెట్టినప్పుడు - చటచటమంటూ వినపడే నీళ్ళ శబ్దం సహించ లేనిదిగా వుంది. ఇది ఎప్పుడురా నిండేది దేవుడా అనిపిస్తాంది.

బిందె సగానికి నిండినప్పుడూ, ముక్కాలు వరకూ నిండినప్పుడూ మారుతా వచ్చే నీళ్ళ శబ్దాన్ని అంతా ఆసక్తితో గమనిస్తాన్నాయి.

బిందె కంఠం వరకూ నీళ్ళు నిండేటప్పుడు వచ్చే శబ్దం ఏదో తీయని కబురు విన్నప్పటి మాదిరి గుండెను ఝల్లుమనిపిస్తాంది.

వంతు తర్వాత వంతు అయిపోతా వస్తాంటే, మనకంటే ముందు ఇంకా ఎంత మంది వున్నారని లెక్కకట్టి ఎదురు చూస్తాన్నారు, ఎంతో ఉత్కంఠ భరితంగా!

"వదినా! మీ అన్న ఇప్పుడే లారీ దిగి వచ్చి అన్నం తింటాండాడు. ఇంట్లో చుక్క నీళ్ళు లేవు. ఈ ఒక్క కడవా పట్టుకోనీ వదినా!" అని అడుక్కొంటా వుంది ఒక ఆయమ్మ.

ఒక కుక్క అటుగా వచ్చి చటుక్కున చటుక్కున మూతి పెట్టి నిండు బిందెలోని నీళ్ళని చప్పరించింది.

"అయ్యో! కుక్క! కుక్క!!! కుక్క ముట్టుకుందే నీళ్ళు. హాయ్. ఛలా!" అంటూ అదిలిస్తాన్నారు.

ఆ బిందెలోని నీళ్ళని కిందికి ఒలక బోస్తాంటే - "అయ్యో! అయ్యో! కిందికి యాల ఒలకబోస్తావమ్మా? నా బిందెలోకి అయినా పొయ్యి. ఇంట్లో ముఖాలు కడుక్కునే దానికి వుంటాయి" అని పోయించుకుంటాంది ఒక నడివయసు పని మనిషి.

పాన్‌షాపు మూతపడింది. టీ బండి వెళ్ళిపోయింది. టైము పన్నెండు కావస్తాండగా వచ్చిన

వంతు.

నా భార్య ఆత్రంగా నాలుగు బిందెలూ కొళాయి దగ్గర పెట్టింది. ఎవరన్నా - "నీ కంటే ముందు నేనే పెట్టి పోయినాను వంతుని" అని అడ్డు తగులుతారేమో అన్న శంక ఆమెను పీడిస్తానే వుంది. ఆ ప్రమాదం ఏమీ జరగలేదు.

ఆమె కొళాయి కింద బిందె పెట్టి హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకుంటూ వుండగా ఠక్కున పోయిన కరెంటు!

'అయ్యో? అయ్యో! కరెంటు పాయెనే! ఎట్లబ్బా చేసేది'' అని అందరిలోనూ దిగులు.

నోటి కాడ కూడు తీసేసినట్లుంది నా భార్య ముఖం.

ఒక బిందె నిండు మరో బిందె సగం నిండాక నీళ్ళు ఆగిపోయినాయి. కరెంటు కోసం ఎదురు చూపులు!

"ఒకయాల కరెంటు వచ్చినా మోటార్లని ఆన్ చేసే వాళ్ళు మేలుకొని వుండల్ల కదా అక్కడ'' అంటూ సంశయాలు.

దేవుడా! నీదే భారం.

అయిదు నిమిషాల తర్వాత వచ్చిన కరెంటు. జనరేటర్ లేని సినిమా హాల్‌లో అర్థగంట కింద పోయిన కరెంటు మళ్ళీ తిరిగి వచ్చినప్పటి మాదిరి సంతోషం!

మరో అయిదు నిమిషాలకు ఘుయ్‌మంటూ గాలిని నెట్టుకొని బుడ బుడ వచ్చిన నీళ్ళు!

నా భార్య బిందెపట్టి పక్కన దింపుతాంటే - "నాకు ఈ కడవ ఒక్కటే వదలమ్మా!" అని అర్థించింది ఒక ముసలవ్వ.

"లేదు. లేదు... చానాసేపయింది మేం వచ్చి" అంటాంది ఆమె.

ఆ ముసిల్ది ఎంతో నిష్టూరంగా మాట్లాడడం ప్రారంభించింది.

"ఒకొక్కరు నాలుగు నాలుగు బిందెలు పట్టుకుపోతే - మా మాదిరి ఒక కడవా, రెండు కడవలూ తెచ్చిన వాళ్లు, ఏం కావల్లమ్మా? మీరు ఒక బిందె పట్టుకుని మాకు ఒక కడవ ఇడిసి పెట్ట కూడదా?"

అక్కడ నీళ్ళకు వచ్చిన వాళ్ళని రెండు వర్గాలుగా చీల్చేసింది అవ్వ!

నాలుగు బిందెలూ, ఆరు బిందెలూ తెచ్చినవాళ్ళు ఒక వైపు!

అన్ని - బిందెల్నీ, కడవల్నీ కొనిపెట్టుకునే తాహతు లేక ఒకటీ రెండూ కడవల్తో వచ్చిన కూలీనాలీ జనం మరో వైపు??

అవ్వకు సపోర్టుగా మాట్లాడేవాళ్ళు - పగలంతా ఎక్కడో కాయకష్టం చేసివచ్చినట్లు అలసిపోయి ఉన్నారు. వాళ్ళ ముఖాలు మురికిగా జిడ్డోడుతా ఉన్నాయి. వాళ్ళ చీరలూ జాకెట్లూ చిరుగుల్తో, రంగు వెలిసిపోయి ఉన్నాయి.

"మీ మాదిరి ఒక కడవ నీళ్ళా, రెండు కడవల నీళ్ళా సరిపోవమ్మా మాకు''అంటాంది ఆమె.

'ఓ ముద్దు అవ్వా! ఓ మురికి అవ్వా! ఓ చింకిరి అవ్వా! ఓ చీపిరి అవ్వా! నీ అవసరం ఒక కడవ. నా అవసరం ఆరు కడవలు. నా పైవాని అవసరం అరవై కడవలు కావచ్చు. ఎవరి స్థాయి వాళ్ళది. ఏ స్థాయికి చెందిన వాళ్ళకు ఆ స్థాయిలో అవసరాలుంటాయి. ఆ స్థాయినీ, అవసరాల్నీ తగ్గించుకోమని చెప్పేదానికి నువ్వెవరివి పిచ్చిదానా?'

ఆ ముసిల్ది మాట్లాడే నిష్ఠూరపు మాటలకు నేను ఎక్కడ మనసు నొచ్చుకుంటానో అని అనుమానంగా చూస్తాంది నా భర్య నా ముఖంలోకి.

ఆమెతోబాటు నేను కూడా బిందెని ఎత్తుకోబోతాంటే —"ఛీ! ఛీ! వద్దు. మీరు ఊరికే నా వెంట రండి"అంది. ఒక బిందెని భుజం మీద మరో బిందెని చంకలోనూ ఎత్తుకుంది.

మేం వచ్చేవరకూ ఆ మిగతా రెండు బిందెల్ని చూస్తావుండమని ఆ బాధ్యతని ఎవరికో వప్పగించింది.

మా వీధి మొదట్లోని చీకట్లోకి వచ్చేసినంక ఆమె భుజం మీది బిందెని బలవంతాన లాక్కుని మోస్తున్నాను; ఫరవాలేదులే? చీకటి! ఎవ్వరూ చూడరు! మన ప్రిస్టేజికి భంగం లేదు అని.

*      *      *

ఉగాది పండుగకి ఇంట్లో అందరం అనంతపురం పోతాంటే —" పాండమ్మా! పొండి! అదృష్ట వంతులు! ఒక వారం దినాలు నీళ్ళ బాధ తప్పి పోతుంది పొండి మీకు" అంటూ చుట్టుపక్కల వాళ్ళ నవ్వులు గంగలూ, బ్రహ్మపుత్రలూ ప్రవహిస్తున్నాయని కాదు గానీ, అనంతపురానికి పోతే మాకు కొంచెం రిలీఫ్. అనంతపురం స్వంత ఇంట్లో వేయించుకున్న ట్యాప్‌ని చూసుకొని మురిసిపోతాంది నా భార్య.

రాయదుర్గం నుంచీ తెలిసినవాళ్ళు ఇంటికి వస్తే — 'అక్కడ రాయదుర్గంలో నీళ్ళు బాగానే వస్తున్నాయా ఇప్పుడు?' అని విచారించి; "అయ్యో! ఆ నీళ్ళ బాధ గురించి ఎందుకు అడుగుతావులే తల్లీ! మీకేం! ఈ వారం దినాల నుంచీ సుఖంగా ఉన్నారు. అక్కడ కొళాయిల్లో నీళ్ళు రాక ఇప్పటికి నాలుగు దినాలు అయింది" అని ఆ వచ్చిన వాళ్ళు తమ గోడును వెళ్ళబోసుకుంటాంటే — ఏదో ప్రమాదాన్ని వెంట్రుకవాసిలో తప్పించుకున్నట్లుహమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది నా భార్య.

రాయలసీమ నీటి సమస్య గురించి అనంతపురంలో రాజకీయోపన్యాసాలు!

నీటి సమస్య మీద అధికార పార్టీపై దుమ్మెత్తిపోసి యుద్ధం ప్రకటించి, నిరాహారదీక్షలు చేసి; కొంత కాలానికి పార్టీ టిక్కెట్ల గురించీ, పదవుల గురించీ బేరసారాలు కుదిరి గప్‌చిప్‌గా ఆ అధికార పార్టీలోకే చేరిపోయిన దేశ సేవకులు!

నా శలవు ముగిసింది.

వారం తరువాత మేము మళ్ళీ రాయదుర్గం వెళ్ళేటప్పటికి ఊరంతా గడబిడగా ఉంది.

పైప్ లైన్లని పగలగొట్టిన వాళ్ళని పట్టుకుని జైల్లో వేసినారు ఆ రోజు.

వాళ్ళు నాయుడి పార్టీ వాళ్ళని మునిసిపల్ ఛైర్మన్ రాంరెడ్డి ఆరోపణ.

"వాళ్ళు నేను పంపిన మనుషులు కారు. కావలిస్తే వాళ్ళనే అడగండి'' అని శ్రీనివాసులు నాయుడు చేస్తున్న ఛాలెంజ్.

" ఎన్నంటే అన్ని నీళ్ళు పట్టుకునేదానికి వీల్లేదు అంటూ అందరి ఇళ్ళల్లోనూ మీటరు ఏర్పాటుచేసి, నీళ్ళు ఎక్కువ పట్టుకున్నవాళ్ళ దగ్గర పెనాల్టీ డబ్బులు వసూలు చేస్తాన్నారు. మరి అతని కులం వాళ్ళ ఇండ్లలోని ట్యాప్‌లకి మీరు ఏర్పాటుచెయ్యలేదే? వాళ్ళతో పెనాల్టీ వసూలు చెయ్యడం లేదే? అతని కులంవాళ్ళు ఎన్నైనా నీళ్ళు పట్టుకోవచ్చా మరి?" అని ప్రత్యారోపణలు కూడా చేస్తాన్నాడు; మీటింగులు పెట్టి.

ఆ రోజు సాయంత్రమే వీధి కొళాయి దగ్గర కొట్లాట! కడవ నీళ్ళ కోసం ఇద్దరాడవాళ్ళ మధ్య తలెత్తిన కొట్లాట మగవాళ్ళ మధ్య యుద్ధం అయింది.

గాల్లో చెప్పులు లేచినాయి.

గాల్లో కట్టెలు ఆడినాయి.

బుర్రలు పగిలినాయి.

నెత్తుర్లు కారినాయి — ఒక్క కడవ నీళ్ళ కోసం!?

" పదండ్లే స్టేషన్‌కి; లేకి నా కొడకల్లారా! మీకు నాగరికత అంటే ఏమో తెలీదురా! మిమ్మల్ని ఊర్లోకి రానియ్యకూడదు. బైట ఉంచల్ల" అంటూ పోలీసులు ఈడ్చుకుంటూ పోయినారు మగవాళ్ళను ఇద్దర్నీ. ఆ ఇద్దరు ఆడవాళ్ళూ ఇంకా ఒకర్నొకరు తిట్టుకుంటూనే ఏడుస్తూ పోతాన్నారు వాళ్ళ వెనకల.

ఆ మరుసటి రోజే పైపులు పగలగొట్టినవలుగురు శాల్తీలూ ఒంటి మీద ఒక పోలీసు దెబ్బ పడకుండా విడుదలైపోయి దర్జాగా తిరగడం మొదలు పెట్టినారు రోడ్లో.' మాకు ఎంత పలుకుబడి ఉందో చూడండి' అన్నట్లు మెరిసిపోతాన్నాయి వాళ్ళ ముఖాలు? వాళ్ళ విడుదల వెనుక రాజకీయ హస్తం ఉందని గుసగుసలు?

పోలీసులతో బేరం కుదరలేదు కాబోలు. మూడు దినాలు గడిచినా బైటపడే మార్గం లేక అట్లే జైల్లో మగ్గిపోతాన్నారు — 'నాగరికతలేని' ఆ ఇద్దరు మనుషులూ?

'ఎవరు ఎన్ని నీళ్ళు వాడతారో తెలిస్తే వాళ్ళ నాగరిక ఏ పాటిదో చెప్పెయ్యొచ్చు' అనేది ఒక సూక్తి! తాగే దానికి ఒక కడవ నీళ్ళు నోచుకోలేని వారికి ఏం నాగరికత ఉంటుంది?

●

ప్రతిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్